సాక్షి శ్రీకాకుళం

శనివారం । 2 । మార్చి । 2024

I



బైక్ అదుపు తప్పి..

బైక్ అదుపు తప్పి ఓ కానిస్టేబుల్ మృతి చెందారు. బూర్జ మండలంలో ఘటన జరిగింది.

- IIలో



దేవతలకు ఆహ్వానం

మందస వాసుదేవుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దేవతాహ్వానం పలికారు.

- IIలో

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూలో డయల్ యువర్ విశ్వవిద్యాలయం ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. వర్సిటీలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమస్యలు, వివరాలు అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఫోన్ నంబర్ 8247861919ను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలు పరిశీలిస్తున్న వీసీ కేఆర్ రజిని, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ అడ్డయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. సైన్స్ కోర్సులకు సంబంధించి 370 మందికి గాను 356 మంది హాజరయ్యారు. ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి 171 మందికి గాను 139 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య పరిశీలించారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, మాస్ కాపీయింగ్ నియంత్రణకు చర్యలు వంటి అధికారులు పరిశీలించి, చీఫ్ సూపరింటెండెంట్‌లకు పలు సూచనలు చేశారు.

డిపోల ద్వారా రాగిపిండి పంపిణీ ప్రారంభం



రాగిపిండి పంపిణీ చేస్తున్న జేసీ నవీన్

గార: చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డు దారులకు జిల్లా అంతటా రాగిపిండి పంపిణీని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ 15వ డిపోలో రాగి పిండి పంపిణీ జరిగింది. జేసీ మాట్లాడుతూ ప్రతి రేషన్‌కార్డుకు కిలో రాగిపిండి అందిస్తున్నామన్నారు. కేజీ రూ. 11 చెల్లించి ఇంటింటికీ వచ్చే వాహనం వద్దనే లబ్ధిదారులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బి.శాంతిశ్రీ, డీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత పరీక్షలు మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 గంటలు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో 10వ తరగతి పరీక్ష కేంద్రాలు–4, ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలు–7 ఉన్నాయన్నారు. పదో తరగతికి 840 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 1800 మంది హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రాక్టికల్స్ మార్చి 30 నుంచి ఏప్రిల్ 3 వరకు ఉంటాయని వివరించారు. డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలని కోరారు.

జిల్లా సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు ఆదివారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అకేని చిరంజీవి రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నగరంలోని బల గ సమీపంలోని (చిట్టివీధి) అయ్యప్పస్వామి దేవాలయం వెనుక నాగావళి నదీ తీరాన ఈ ఎంపికలను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 85 కేజీలలోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా క్రీడాకారులను నెల్లూరు వేదికగా మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే 70వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని ఆయన వెల్లడించారు. క్రీడాకారులు మరిన్ని వివరాలకు 96763 64646 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పింఛన్ల వేడుక.. భావోద్వేగాల వేదిక

ఆనందాలు, ఆశీర్వాదాలు, ఉత్సాహాలు, ఉత్సవాలు.. ఒకటో తేదీన ఊరూరా గమనించిన భావోద్వేగాలివి. ఠంచనుగా ఫస్టు నాటికి పింఛన్ చేతికి అందుతుండడంతో లబ్ధిదారులు ఎనలేని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ అవసరాలకు ఈ డబ్బే అక్కరకు వస్తోందని, ప్రతి నెలా ఒకటో తేదీ నాటికే అందించడం తమబోటి వారికి వరం లాంటిదని అంటున్నారు. ఇలాంటి పాలన కలకాలం సాగాలని ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారు.



నరసన్నపేట: తామరాపల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న వలంటీర్ భారతి



రణస్థలం: శ్రీకాకుళం రిమ్స్‌లో అసిరయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు పైడితల్లి

పింఛనే అండ

చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు దుప్పాడ అసిరయ్య. అతని భార్య దుప్పాడ సీతమ్మ. వీరిది సంచాం పంచాయతీలో గల పున్నానపాలెం. అసిరయ్య నాలుగేళ్ల కిందటి వరకు పరిశ్రమలో పనిచేసేవారు. కిడ్నీ వ్యాధి వచ్చి పని మానేశారు. రెండు కిడ్నీలూ పాడైపోయాయి. వీరికి ఇద్దరు కుమారు లు, ఒక కుమార్తె. అసిరయ్య మందులకు, పిల్లల చదువులకు చాలా ఇబ్బంది పడేవారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఏకంగా రూ.10వేలు పింఛన్ ఇచ్చారు. వలంటీర్ ఒకటో తేదీకే పింఛన్ తెచ్చి ఇచ్చేస్తారు. ఈ డబ్బే వారికి కొండంత అండ. అసిరయ్య రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.



జలుమూరు : పింఛన్ అందుకుంటున్న శ్రీదేవి

నాకు జగనన్నే దిక్కు..

నా పేరు అన్నెపు శ్రీదేవి. దరివాడ పంచాయతీ ఊడికలపాడు గ్రామం మాది. నాకు రెండు కాళ్లు పనిచేయవు. తండ్రి కూడా లేరు. తల్లి కూలి పనులు చేసుకుంటూ నన్ను పోషిస్తోంది. నా జీవితం ఎలా గడుస్తుందా అని బెంగపడేదాన్ని. నాకు ఆర్థికంగా ఏ ఆధారం లేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక నాకు పింఛన్ మంజూరు చేశారు. కన్నతండ్రి లేకున్నా ఇప్పుడు నేను సాఫీగా బతకగలుగుతున్నాను. నా పింఛన్ డబ్బును నా అవసరాలకు వాడుకోవడంతో పాటు అమ్మకు కూడా కొంత ఇస్తాను.

బెంగ లేదు

నా పేరు ఆనింగి బుచ్చమ్మ. నేను ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని 9వ వార్డు ముడియావీధిలో ఉంటాను. నా కుమారుడు సోమేష్ మానసిక వికలాంగుడు. నాకు వయసు మీద పడడంతో కష్టపడలేకపోతున్నాను. ప్రభుత్వం అందిస్తున్న పింఛనే మా తల్లీబిడ్డల కడుపు నింపుతోంది. జగన్ బాబు పుణ్యమా అని ఒకటో తేదీకే పింఛన్ అందుకుంటున్నాం. దీంతో మా మందులకు బెంగ లేకుండాపోయింది.



ఇచ్ఛాపురం: బుచ్చమ్మ, సోమేష్‌లకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కరీమున్నీసా

మళ్లీ జగనే రావాలి

ఒకటో తేదీకే పింఛన్లు అందుతుండడంతో మా కష్టాలు తీరాయి. గతంలో పింఛన్లు అందుకోవడానికి నానా ఇబ్బందులు పడేవాళ్లం. మా పాలిట జగన్‌బాబు దేవుడు. మళ్లీ జగనే రావాలి. ఇలాగే పింఛన్లు ఇవ్వాలి.

– కొల్ల సుందరమ్మ, ప్రగడ గున్నమ్మ, కైవాడ రమణమ్మ తామరాపల్లి, నరసన్నపేట మండలం

తొలిరోజు 77.48% జిల్లావ్యాప్తంగా తొలి రోజు 77.48 శాతం మందికి పింఛన్లు అందజేశారు. మొత్తం పింఛన్లు 3,22,825 కాగా.. తొలి రోజు 2,50,125 మందికి పెన్షన్లు అందించారు.

50,945 మంది విద్యార్థులకు రూ.35.17 కోట్లు

- జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న విద్యా దీవెన కింద జిల్లాలో రూ. 35.17 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయి. కృష్ణా జిల్లా పామర్రులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివేందుకు అవకాశాలు ఉన్నాయని, సదుపాయాలు వినియోగించుకోవాలని సూచించారు. రానున్న రెండు మూడు రోజుల్లో తల్లుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని చెప్పారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే 50,945 మంది విద్యార్థులకు గాను 45,869 తల్లుల ఖాతాల్లో రూ. 35.17 కోట్లు నగదు జమ చేశారు.

కార్యక్రమంలో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విశ్వమోహన్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనురాధ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్ పలు కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జగనన్న విద్యా దీవెన నమూనా చెక్కును విద్యార్థులకు అందజేశారు.



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ తదితరులు



కేటగిరి	విద్యార్థులు	విద్యార్థుల తల్లుల ఖాతా	నగదు
ఎస్సీ	3,964	3,602	రూ.2,55,42,454.
ఎస్టీ	1,335	1,245	రూ.71,26,307
బీసీ	43,179	38,799	రూ.30,00,54,904
ఈబీసీ	1,539	1,433	రూ.1,11,56,397
ముస్లిం మైనారిటీ	158	138	రూ.9,51,587
కాపు	747	703	రూ.67,23,633
క్రిస్టియన్ మైనారిటీ	23	22	రూ.2,11,943

ఎంతో ఉపయోగకరం



నా తండ్రి రైతు. నా కుటుంబానికి ఆర్థిక స్థోమత తక్కువ. అయినా నేను ఇంజినీరింగ్ చేయగలుగుతున్నానంటే అది సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాల వల్లనే. నాకు ఒక తమ్ముడు ఉన్నాడు. అతనికి అమ్మ ఒడి వస్తుంది. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. పేదలపై భారం పడకుండా కాపాడుతుంది.

– కల్పన, ఇంజినీరింగ్ విద్యార్థి

ఆర్థిక స్థోమత లేకపోయినా..



మా కుటుంబం వ్యవసాయంపై ఆధార పడి బతుకుతోంది. పెద్దగా ఆర్థిక స్థోమత లేకపోయినా నేను ఇంజినీరింగ్ చేస్తున్నానంటే కారణం విద్యా దీవెన, వసతి దీవెన పథకాలే. పేదలకు డబ్బు ఆర్థిక సమస్యలు అడ్డం కాకూడదని సీఎం వైఎస్ జగన్ ఎవరూ ఊహించని పథకాలు అమలు చేస్తున్నారు.

– ఢిల్లేశ్వరి, ఇంజినీరింగ్ విద్యార్థిని

విద్యా దీవెన ఓ వరం



ఆర్థిక సమస్యలతో వేసారిపోతున్న కుటుంబాలకు విద్యా దీవెన ఓ వరం. సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారు. విదేశాల్లోనూ ఉన్నత విద్యకు సాయం అందిస్తున్నారు.

– నవీన్, ఇంజినీరింగ్ విద్యార్థి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై శిక్షణ



మాట్లాడుతున్న సీపీఓ ప్రసన్నలక్ష్మి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నిర్వహణ అధికారులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సంపూర్ణ అవగాహన ఉండాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పీఎస్ఎస్ ప్రసన్నలక్ష్మి అన్నారు. శ్రీకాకుళంలోని బీఆర్ అంబేడ్కర్ కళా వేదికలో సాధారణ ఎన్నికలు– 2024కు సంబంధించి ఈఆర్‌ఓలు, సబ్ డివిజనల్ పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూయింగ్ టీమ్స్ తదితరులకు ఆమె శుక్రవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఎన్నికల్లో పాటించాల్సిన నియమనిబంధనలను వివరించారు. నోటిఫికేషన్ వచ్చాక తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల ఖర్చు నియంత్రణకు చేపట్టాల్సిన కార్యక్రమాలను విశదీకరించారు.

'వంద రోజులు పని కల్పిద్దాం'



సమావేశంలో పాల్గొన్న ఏపీడీలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని అన్ని మండలాల్లోనూ సిబ్బంది క్షేత్రస్థాయిలో వేతనదారులకు 100 రోజుల పని దినాల కల్పనే ఏకైక లక్ష్యంగా విధులు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గంటా వెంకట చిట్టిరాజు ఆదేశించారు. ఆయన శుక్రవారం డ్వామా కార్యాలయంలో ఏపీడీలు, అన్ని మండలాల ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఉపాధి హామీ పథకం పనుల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 70 రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కూలీలకు 100 పని దినాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 116, 108 వంద రోజుల పనిదినాల కల్పన జిల్లా లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని చేరుకోకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. రాష్ట్రంలోనే జిల్లా ఉపాధి పనుల కల్పన, నిబంధనలు అమలు వంటి అంశాల్లో ముందంజలో ఉందని సిబ్బందికి కితాబు ఇచ్చారు. సగటు వేతనం పెరగాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో సగటు పని దినాలు కూడా ఎక్కువగా ఉండేలా దృష్టి సారించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు పూర్తిస్థాయిలో ఉపాధిని కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. ఉపాధి పథకం అమలుకు సంబంధించి స్పందన కార్యక్రమంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా మండలాల స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కార్యక్రమం పర్యవేక్షణ అధికారి కేవీ అప్పలనాయుడు, ఏపీడీలు పి.రాధ, శైలజ, జి.హరిత, లోకేష్, మురళీకృష్ణ, 30 మండలాల ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం




శ్రీకాకుళంలో పరీక్షకు సమయం సమీపిస్తుండటం పరుగులు తీస్తున్న ఓ విద్యార్థిని



శ్రీకాకుళం చైతన్య సహకార కళాశాల కేంద్రంలో పరీక్ష రాసేందుకు చేరుకున్న విద్యార్థులు

- తొలిరోజు సెట్–1 ప్రశ్న పత్రంతో పరీక్ష రాసిన ఫస్టియర్ విద్యార్థులు
- 83 పరీక్షా కేంద్రాల్లో 20,847 మందికి 653 మంది గైర్హాజరు
- నేడు సెకండియర్ పరీక్షలు మొదలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సెట్–1 ప్రశ్న పత్రంతో తెలుగు, సంస్కృతం, హిందీ, ఒరియా పేపర్లకు ఫస్టియర్ విద్యార్థులు పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 83 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలకు తొలిరోజు 20,847 మంది హాజరుకావాల్సి ఉండగా 20,194 మంది హాజరయ్యారు. 653 మంది గైర్హాజరయ్యారు. శనివారం నుంచి సీనియర్ ఇంటర్ పరీక్షలు మొదలుకానున్నాయి.



శ్రీకాకుళంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్

పక్కాగా ఏర్పాట్లు..

జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. పోలీసుల పహారాతో పాటు 144 సెక్షన్‌ను పక్కాగా అమలు చేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ కొన్ని ప్రత్యేక రూట్లలో బస్సులను నడిపించింది. మెడికల్ సిబ్బంది ఫస్ట్ ఎయిడ్ కిట్లతో కేంద్రాల్లో సేవలు అందించారు. నో సెల్‌ఫోన్ జోన్‌లుగా పరీక్ష కేంద్రాలను భావించి వాటిని పూర్తిగా నిరాకరించారు. సీసీ కెమెరాల స్ట్రీమింగ్‌తో పాటు పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు పెద్దపీట వేశారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను పలువురు అధికారులు పరిశీలించారు. జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ శ్రీకాకుళంలోని చైతన్య సహకార జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలించారు. పోలీసుల బందోబస్తును, సీసీ కెమెరాలను పరిశీలించారు. జిల్లాలో 144 సెక్షన్ అమలును పక్కాగా అమలు చేయాలని పోలీసులకు పలు సూచనలు చేశారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీవీఈఓ కోట ప్రకాశరావు పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌ఐఓ ప్రగడ దుర్గారావు, అలాగే డీఈసీ కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యామ్‌సుందర్, గూణ సింహాచలం, కీర్తి తవిటినాయుడు శ్రీకాకుళంలోని శ్రీచైతన్య కళాశాల, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ బాలికలు పెద్దపాడు, గాయిత్రి జూనియర్ కళాశాల మునసబ్‌పేట తదితర కేంద్రాలను పరిశీలించారు. హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో 40కిపైగా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలిరోజు ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు.

సెపక్‌తక్ర క్రీడాకారులకు అభినందన



జిల్లా సబ్‌జూనియర్స్ సెపక్‌తక్ర క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి,అర్జున్, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ సెపక్‌తక్ర క్రీడాకారులు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నారని సెపక్‌తక్ర అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. గతనెల 24, 25 తేదీల్లో నెల్లూరు వేదికగా జరిగిన 26వ ఏపీ రాష్ట్రస్థాయి సబ్–జూనియర్స్ బాలబాలికల సెపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం బాలురు జట్టు తృతీయ స్థాయిలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు టీషర్టులు, మిఠాయిలను పంపిణీ చేశారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టుకు జిల్లా నుంచి ఎంపికైన చిరంజీవి, స్వప్నలు శిక్షణ శిబిరాలకు ఎంపిక కావడంపై ఎమ్మెస్సార్‌తోపాటు సంఘ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు నిరంతరం శిక్షణ అందించి ప్రోత్సహిస్తున్న సంఘ కార్యదర్శి, డీఎస్ఏ కోచ్ జి.అర్జున్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో శశికుమార్, రజాక్, సింహాచలం, గణేష్, ప్రవీణ్, లవకుమార్, సతీష్, అరుణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి ధర్మానను కలిసిన డీసీహెచ్ఎస్ అధికారి



మంత్రి ధర్మానను కలిసిన డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి శుక్రవారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో గల ఆస్పత్రులు ఎలా పనిచేస్తున్నాయి, విధులకు ఎంత మంది సిబ్బంది హాజరవుతున్నారు, మౌలిక వసతులపై ఆయన అడిగి తెలుసుకున్నారు.

31 మందికి నియామక పత్రాలు



పశుసంవర్థక శాఖ కార్యాలయం వద్ద ఎంపికైన అభ్యర్థులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పశు సంవర్థక శాఖలో సచివాలయ పరిధిలోగల పశుసంవర్థక సహాయకులుగా (ఏహెచ్ఏ) 31మంది ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం ఆ శాఖ జేడీ కిశోర్ నియామక పత్రాలు అందించారు. ఏపీపీఎస్ ద్వారా గత ఏడాది డిసెంబర్ 31న నిర్వహించిన పరీక్షకు 1401 మంది హాజరయ్యారు. వీరిలో రోస్టర్, రిజర్వేషన్ కేటగిరీ ప్రాతిపదికన నియమించారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించి ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా నియామక పత్రాలు అందించారు. వీరంతా రెండు మూడు రోజుల్లో ఎవరికి కేటాయించిన స్థానాల్లో వారు విధుల్లో చేరనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 381 మంది ఉండగా కొత్తగా ఉద్యోగం పొందినవారితో కలుపుకొని 412మంది ఏహెచ్ఏలుగా విధులు నిర్వహించి పాడి రైతులకు సేవలు అందించనున్నారు.

భవిత పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



స్థానిక భవిత కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న స్టేట్ టీమ్ సభ్యులు

నరసన్నపేట: భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ పిల్లలపై మరింత శ్రద్ధ పెట్టాలని స్టేట్ మానిటరింగ్ టీమ్ సభ్యులు ఎస్.అమ్మినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత పిల్లల కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర టీమ్ పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఐఈడీ కోఆర్డినేటర్లకు పలు సూచనలు చేశారు. వీరి వెంట జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ బి.గోవిందరావు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వి. ఉమ, నరసన్నపేట ఎంఈఓ శాంతారావు, స్కూల్ హెచ్ఎం వెంకటరావు ఉన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 26 నుంచి జనవరి 1 వరకు నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ప్రశంసా పత్రాలను అందజేశారు. బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను వారం రోజులు పాటు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్డీఎం సూర్య కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవతలకు ఆహ్వానం

మందసలో జరుగుతున్న వాసుదేవుని బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం దేవతాహ్వానం క్రతువు సంప్రదాయబద్ధంగా జరిగింది. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య స్వామి ధ్వజారోహణం చేశారు. విశేష గరుడపూజ అనంతరం సంతానార్థులకు గరుడ ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు శ్రీత్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి ఆలయానికి చేరుకున్నారు.

- మందస



దేవతాహ్వానం పలుకుతున్న దృశ్యం



శ్రీదేవి, భూదేవి సహిత సర్వాలంకృతుడైన శ్రీవాసుదేవపెరుమాళ్లు



హనుమద్వాహన సేవ చేస్తున్న దృశ్యం

సంక్షేమ రాజ్యంతో ప్రజల్లో ఆనందం



లోలుగులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: గ్రామాల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరిస్తుండటంతో గడప గడపకూ మన ప్రభుత్వం ప్రజాదరణ పొందిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని లోలుగు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతుండటంతో జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని చెప్పారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన చేస్తున్నారని చెప్పారు. మళ్లీ సంక్షేమ పథకాలు అందాలన్నా, అవినీతి రహిత పరిపాలన కావాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కోరారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికి ఎలాంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామని చెప్పారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, లోలుగు లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమిని చిత్తుగా ఓడించాలి



బుడారిసింగిలో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ చంద్రబాబుకు మతి భ్రమిస్తోందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమిని చిత్తుగా ఓడించాలని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. మండలంలోని బుడారిసింగి పంచాయతీలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బుడారిసింగిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత దూషణలకు దిగుతూ.. తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రం శ్రీలంక, మరో పాకిస్థాన్‌లా మారిపోతుందని భయపెట్టిన చంద్రబాబు సీఎం వైఎస్ జగన్ పథకాలను కాపీ కొట్టడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్‌తో పోరాడే శక్తి లేక పొత్తులకు సిద్ధమయ్యారని అన్నారు. కరోనా కష్టకాలంలో కూడా పథకాలను అమలు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. ఐదేళ్ల పాలనలో కరోనా రెండేళ్లు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిందని, అయినా అభివృద్ధి చేసి చూపించామని అన్నారు. ఎన్నికల ముందు ప్రతిపక్షాలు చేస్తున్న గిమ్మిక్కులకు ప్రజలు మోసపోవద్దని హితవు పలికారు. ఈ ఎన్నికల అనంతరం టీడీపీ, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు కనుమరుగవుతాయన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గల బుడారిసింగి పంచాయతీకి సుమారు 40 సార్లు వచ్చానని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చగలిగామన్నారు. సర్పంచ్ సురేష్‌కుమార్ పాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, ఎంపీటీసీ సీర లోకనాథం, కంచిలి ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ చింతాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై..



నరసన్నముకుందాపురం గ్రామస్తులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలనకు ఆకర్షితులమై తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని కంచిలి మండలం అంపురం పంచాయతీ పరిధి నరసన్నముకుందాపురం గ్రామ పెద్ద మునకాల పోలయ్యతో సహా మిగతా గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ గ్రామానికి చెందిన మునకాల చంద్రయ్య, పిల్లి గజేంద్ర, మునకాల ఢిల్లీరావులతో కలిసి 70 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. అలాగే కుంబరినౌగాం పంచాయతీ పరిధి సింకులి, సింగుపురం గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు టొంకాధర ప్రధాన్, ఖెత్రో మోని దొలాయి, కుర ప్రధానోలతో కలిసి 40 గిరిజన కుటుంబాల వారికి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవ పాత్రో, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, సర్పంచ్‌లు మద్ది మోహిణి, హరిబంధు జన్ని, నేతలు దుర్గాసి ధర్మారావు, ఖగేశ్వర గౌడో, మద్ది ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించండి'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సంసిద్ధతకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది నియామకం, శిక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులు 4622 మాత్రమే పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. వివిధ రకాల 356 ఫిర్యాదులు వచ్చాయని, ఆయా సమస్యలను పరిష్కరించామన్నారు. ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అన్ని వివరాలు తెలియజేస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ఈఆర్వోలు నూరుల్ కామర్, ఎస్.భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, విద్యాసాగర్, పీఎస్ఎస్ ప్రసన్నలక్ష్మి, చిట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ ఫలితాలు సాధించాలి'



కోటబొమ్మాళి హైస్కూల్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

కోటబొమ్మాళి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, అందుకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని విశాఖపట్నం జోన్-1 ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి ఆదేశించారు. ఆమె శుక్రవారం కోటబొమ్మాళి హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి క్లాస్‌రూమ్‌కు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలకు కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం కొత్తపేటలోని కేజీబీవీని సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ-1,2 ఎస్ అప్పలరాజు, ఎల్.విశ్వప్రతాప్, హెచ్ఎం డి.గోవిందరావు, కేజీబీవీ ఎస్ఓ లక్ష్మీ ప్రశాంతి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆస్పత్రిలో అధునాతన హంగులు



ఆస్పత్రి ప్రారంభోత్సవంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తదితరులు

జి.సిగడాం: ప్రాథమిక ఆస్పత్రుల్లో అధునాతన హంగులు ఏర్పాటు చేస్తున్నారని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారుగా రూ.70 లక్షల వ్యయంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు సదుపాయాలు కల్పించారు. డెలివరీ, ఆపరేషన్ థియేటర్, కొత్త వార్డులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. నాడు-నేడుతో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందని, దీనికి తోడు డాక్టర్ రెడ్డీస్ వంటి వారు ఆస్పత్రులను బాగు చేయించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ భవనాల్లో సోలార్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించి మరింత మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ఈ ఆస్పత్రిలో ప్రసవాలు అధికంగా చేస్తుండడంపై కలెక్టర్ అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎన్.నిర్మల, రెడ్డీస్ ఫౌండేషన్ సీఈఓ శామిక్ టెర్నన్, రెడ్డీస్ ప్రతినిధులు శ్రీనివాస్ ప్రణబ్ కుమార్ చౌదరి, బి.సురేష్, అనిల్, కేవీఎస్ఎన్ రాజు, జోగారావు, దీపిక్, వైద్యులు బుడుమూరు యశ్వంత్, సుమబిందు, పున్నాన సోనియా తదితరులు పాల్గొన్నారు.

'ఎంఎస్ఎంఈలను వినియోగించుకోవాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: యువత ఎంఎస్ఎంఈలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ శుక్రవారం వెల్లడించారు. ఎంఎస్ఎంఈ బేనర్‌ను కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఏడీలు రమణారావు, రఘునాథ రావు, తదితరులు పాల్గొన్నారు. ఫార్మలైజేషన్ ఆఫ్ ఎంఎస్ఎంఈ లు, ఏపీ ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ 20వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు.

రైస్ మిల్లులో చోరీ




రైస్ మిల్లు పరిసరాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ ప్రేమ్ కాజల్

సారవకోట: మండలంలోని చీడిపూడి శ్రీ వెంకటేశ్వర మోడ్రన్ రైస్ మిల్లులో గురువారం రాత్రి 1 గంట సమయంలో చోరీ జరిగింది. ఈ దొంగతనంలో రూ.1.30 లక్షలు దొంగిలించారని మిల్లు యజమాని వారణాశి సర్వేశ్వరరావు తెలిపారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మిల్లు ఆవరణలో నైట్ వాచ్‌మెన్ వెంకయ్య రోజూ నిద్రపోతారు. గురువారం రాత్రి కూడా ఆయన నిద్ర పోతుండగా ముఖాలకు గుడ్డలు చుట్టుకుని నలుగురు దుండగులు వచ్చి మొదటి లైట్ ఆఫ్ చేశారు. నిద్రలో ఉన్న వెంకయ్యకు మెలకువ రావడంతో ఎవరంటూ ప్రశ్నించారు. దీంతో వారు కత్తిని అతని మెడ మీద పెట్టి బెదిరించారు. అనంతరం వారు మిల్లు ఆఫీసు గది తాళాన్ని పగుల గొట్టి తొలుత సీసీ కెమెరాల డీవీఆర్ ధ్వంసం చేశారు. అనంతరం బెంచీ డ్రాయర్‌లో ఉన్న రూ 1.30 లక్షల నగదును, సీసీ కెమెరాల డీవీఆర్‌ను తీసుకుని పక్కనున్న పొలాల గుండా వెళ్లిపోయారు. వారు వెళ్లాక వెంకయ్య మిల్లు గుమస్తా కర్ణం వీరయ్య ఇంటికి వెళ్లి జరిగినందంతా చెప్పారు. దీంతో ఆయన యజమానికి సమాచారం అందజేశారు. ఆయన సారవకోట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. జలుమూరు, సారవకోట ఎస్ఐలు మధుసూదనరావు, అప్పారావులతో పాటు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం, నేర విభాగం సిబ్బంది హాజరై దర్యాప్తు ముమ్మరం చేశారు. శుక్రవారం అడిషనల్ ఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్, టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి, నరసన్నపేట సీఐ ప్రసాదరావు, సీసీఎస్ ఎస్ఐ సూరిబాబులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బుడితిలోనూ..

రైస్ మిల్లులో చోరీకి పాల్పడిన దుండగులు తొలుత బుడితి గ్రామంలో ఉన్న నాలుగు దేవాలయాల్లో చోరీకి విఫలయత్నం చేశారు. షిర్డీ సాయి మందిరంలో ఉన్న హుండీని తీసుకుని పొలాల్లో పడేశారు. అయితే ఈ హుండీలో ఎలాంటి డబ్బులు లేనట్లు ఆలయ అర్చకులు దిలీప్‌కుమార్ తెలిపారు. అలాగే అయ్యప్ప స్వామి ఆలయ స్టోర్ రూం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయాల గేట్లు సైతం పగులగొట్టారు. అక్కడే ఉన్న సీసీ కెమెరాల డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్లారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని పెయింటర్ మృతి





బస్సు కింద మృతదేహం (ఇన్‌సెట్లో) రమణ(ఫైల్)

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని గేటు ప్రాంతంలో ఇందిరాగాంధీ విగ్రహం జంక్షన్ వద్ద మలుపులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్టి రమణ (47) అక్కడికక్కడే మృతి చెందారు. ఆమదాలవలస ఎస్ఐ-2 ఐ.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పురపాలక సంఘంలోని 20వ వార్డు వెంగళరావు కాలనీకి చెందిన శెట్టి రమణ మార్కెట్‌లో వస్తువులు కొనుగోలుకు గేటు ప్రాంతానికి వచ్చి తిరిగి వెళ్తుండగా.. అదే సమయంలో కొత్తూరు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మలుపు తిరుగుతూ ఆయనను ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. చక్రాల కింద పడిపోవడంతో శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. మృతుడు పెయింటర్‌గా రోజువారి కూలీ పనులకు వెళ్తుంటారు. ఆయనకు భార్య అనూరాధ, కుమారుడు రాజు ఉన్నారు. కుటుంబ పెద్ద మరణంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. భార్య అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి కానిస్టేబుల్ మృతి



క్షతగాత్రుడిని 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం



సురేష్ (ఫైల్)

బూర్జ: మండలంలో గల నీలంపేట గ్రామం శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిపై శుక్రవారం బైక్ అదుపు తప్పి కొత్తూరు సురేష్ (38) అనే పోలీస్ కానిస్టేబుల్ మృతిచెందారు. ఆయన బూర్జ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. స్థానిక ఎస్ఐ జీవీ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. సురేష్ ఏడాది కాలంగా బూర్జ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఈయన శుక్రవారం ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు గాను బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులకు హాజరయ్యారు. పరీక్ష పూర్తయ్యాక పేపర్ తరలించే క్రమంలో బందోబస్తుకు బైక్‌పై వెళ్తుండగా దారిలో కుక్క అడ్డుగా రావడంతో దాన్ని తప్పించబోయి బైక్‌పై నుంచి కింద పడిపోయారు. వెంటనే అటుగా వెళ్తున్న వారు 108కు సమాచారం అందజేయడంతో ఆయనను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ ఆస్పత్రికి తరలించే లోపే ఆయన మృతి చెందారు. మృతుడికి భార్య శిరీష ఉన్నారు. పిల్లలు లేరు. ఈయన స్వస్థలం విజయనగరంలో రామానగరం. ఈయన 2009 బ్యాచ్‌కు చెందిన వారు. రిమ్స్‌లో మృతదేహం ఉంచడంతో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామం మెయిన్ రోడ్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానిక ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. అచ్చనాపురం గ్రామానికి చెందిన సవర రేవంత్, సవర సూర్య గ్రామంలో జరుగుతున్న ఓ శుభకార్యం విందు భోజనాలకు సంబంధించి సామగ్రి తీసుకురావడానికి జాడుపల్లి గ్రామానికి వచ్చారు. అనంతరం తిరిగి ద్విచక్రవాహనం పై అచ్చనాపురం గ్రామానికి వెళుతున్న సమయంలో బండి అదుపు తప్పి పడిపోయారు. దీంతో వెంటనే వీరిని 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. బండి నడుపుతున్న రేవంత్‌కు తలకు బలమైన గాయం కావడంతో అక్కడి నుంచి శ్రీకాకుళం జెమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.